సాక్షి
నంద్యాల
మంగళవారం। 11। మార్చి। 2025



మల్లన్నకు సోమవార సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవార సేవను నిర్వహించారు. పూజల అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేపట్టారు.



బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంలో సిబ్బంది బదిలీలకు రంగం సిద్ధమైంది. కమాండెంట్ దీపిక పాటిల్ ఆదేశాల మేరకు బదిలీల జాబితా సిద్ధమైనట్లు చర్చ జరుగుతోంది. 8లో▸

ఉష్ణోగ్రతలు

కనిష్ఠం	20.8
గరిష్ఠం	36.5

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:32	ఉ॥ 5:07
ఆదోని	సా॥ 6:31	ఉ॥ 5:08
నంద్యాల	సా॥ 6:29	ఉ॥ 5:07
ఆత్మకూరు	సా॥ 6:28	ఉ॥ 5:02
బనగానపల్లె	సా॥ 6:31	ఉ॥ 5:03

హదీస్ వెలుగు :
అల్లాహ్‌కి ఇష్టమైన పుణ్య కార్యాల్లో జకాత్ ఒకటి. మీ ధన, సంపద మొత్తంలో 2.50 శాతం జకాత్ పేరుతో దానధర్మాలు చేయండి.
– పవిత్ర ఖురాన్

ఉపాధి కూలీల ఆకలి కేకలు

- రెండు నెలలుగా వేతనాలు అందని వైనం
- జిల్లాలో రూ. 80 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్
- వ్యవసాయ పనుల్లేక.. ఉపాధి వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు
- ఆందోళనకు సిద్ధమైన కూలీలు
- 12న చలో విజయవాడకు పిలుపు

సంక్షేమం, అభివృద్ధిని విస్మరించిన కూటమి ప్రభుత్వం చివరకు ఉపాధి కూలీల కడుపుకొడుతోంది. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఓ వైపు వ్యవసాయ పనులు లేక.. మరో వైపు నెలల తరబడి ఉపాధి కూలీల వేతనాలు అందక కూలీలు అర్ధాకలితో అలమటిస్తున్నారు. చేసిన పనులకు వారాల తరబడి వేతనాలు అందకపోవడం, వేసవికాలం ప్రారంభమైనప్పటికీ పనుల వద్ద వసతులు కల్పించకపోవడంతో కూలీలు అవస్థలు పడుతున్నారు. ఇంకెన్నాళ్లు ఈ సమస్య అంటూ ఉపాధి కూలీలు పిడికిలి బిగించి ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

మండుటెండల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



జిల్లాలో జాబ్ కార్డులు :	4.38 లక్షలు
ఉపాధి కూలీలు :	8.70 లక్షల మంది
పనులకు వెళ్తున్న వారు :	2.55 లక్షల మంది
పెండింగ్ బిల్లు :	రూ. 80 కోట్లు

కోవెలకుంట్ల: జిల్లాలో పప్పుశనగ, జొన్న కోత, నూర్పిడి పనులు, మిరప కోతలు పూర్తి కావడంతో కూలీలు ఉపాధి పనులపై మొగ్గు చూపుతున్నారు. ఫాంపాండ్స్, చెరువులు, కుంటలు, కాల్వల్లో పూడికతీత, ముళ్ల పొదల తొలగింపు, మట్టిరోడ్లు, తదితర పనులకు వెళుతున్నారు. కూలీలకు రోజుకు రూ. 300 వేతనం నిర్ణయించారు. అయితే పనులకు వెళుతున్న కూలీలకు రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 4.38 లక్షల జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 8.70 లక్షల మంది కూలీలు ఉన్నారు. 1.50 లక్షల కుటుంబాల్లోని 2.55 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. ఈ నెలాఖరు నాటికి 2024- 25 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ముగియడంతో నెల రోజుల నుంచి ఉపాధి పనులు ఊపందుకున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆయా మండలాల్లో 78,23,780 పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం రూ. 335 కోట్ల లేబర్ (కూలీల వేతనం, మెటీరియల్ కలిపి)బడ్జెట్ కేటాయించారు. అయితే రెండు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందడం లేదు. జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో సుమారు రూ. 80 కోట్లకు పైగా వేతనాలు విడుదల కావాల్సి ఉంది. ఇద్దరు సభ్యులున్న ఒక్కో కుటుంబానికి దాదాపు రూ. 30 వేల చొప్పున వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు వ్యవసాయ పనులు లేక మరో వైపు ఉపాధి పనులకు వెళుతున్నా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు, నిత్యావసరాలు, తదితర సరుకులను అప్పులు చేసి తెచ్చుకోవాల్సి తెచ్చుకుంటున్నారు. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో వ్యాపారులు అప్పులు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాలు ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంతో కూలీలు ఆందోళనకు శ్రీకారం చుట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వేతనాలు విడుదల చేయాలని, ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12వ తేదీన చలో విజయవాడ పేరుతో ఆందోళన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



పనుల వద్ద వసతులు లేవని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ఎదుట వాపోతున్న కూలీలు

పనుల వద్ద వసతులు నిల్

ఉపాధి కూలీలను వేతనాలతోపాటు వసతుల లేమి వెంటాడుతోంది. వేసవికాలం ప్రారంభమైనా పనుల వద్ద ఇప్పటి వరకు ఎలాంటి వసతులు కల్పించ లేదు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పనుల వద్ద టెంట్లు ఏర్పాటు చేసి నీడ వసతితో పనులు కల్పించాల్సి ఉంది. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఇప్పటి వరకు టెంట్ల ఏర్పాటు ఎక్కడా కన్పించడం లేదు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు కూలీలకు అందుబాటులో ఉంచాల్సి ఉండగా ఆ దిశగా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎండతీవ్రత బారిన పడకుండా కూలీలకు ఎప్పటికప్పుడు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాల్సి ఉంది. తాగునీటిని బాటిళ్లతో తీసుకెళ్లి దాహార్తి తీర్చుకుంటున్నారు. నీరు వేడెక్కకుండా కంప చెట్ల కింద భద్రపరుచుకోవాల్సి వస్తోందని కూలీలు వాపోతున్నారు. మెడికల్ కిట్లు లేకపోవడంతో పనులు చేసే సమయంలో చిన్న చిన్న గాయాలైనా తప్పని పరిస్థితుల్లో పనులు చేయాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయడంతోపాటు పనుల వద్ద వసతులు కల్పించి ఆదుకోవాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

ఎనిమిది వారాల బిల్లులు రావాలి



ఎనిమిది వారాల నుంచి చెరువులో పూడికతీత, ఫాంపాండ్స్ తవ్వకం వంటి పనులకు వెళుతున్నాను. వారాల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కుటుంబ పోషణ భారంగా మారింది. కూరగాయలు, నిత్యావసర సరుకులు అప్పులు చేసి కడుపు నింపుకోవాల్సి వస్తోంది. అధికారులు త్వరితగతిన బిల్లులు విడుదల చేసి ఆదుకోవాలి.
– ఈశ్వరమ్మ, ఉపాధి కూలీ, కోవెలకుంట్ల

డబ్బులివ్వకుంటే పూట గడిచేదెలా



వ్యవసాయ పనులు లేక ఉపాధి పనులకు వెళుతున్నాను. రోజుకు 250 రూపాయల కూలి కోసం రెక్కలు ముక్కలు చేసుకుని పనులు చేస్తున్నాం. రెండు నెలలుగా పనికి వెళుతున్నా ఇప్పటి వరకు కూలీ డబ్బులు రాలేదు. డబ్బులు లేక పూట గడవటం కష్టంగా ఉంది. చేసిన పనులకు అధికారులు వెంటనే డబ్బులు చెల్లించి ఆదుకోవాలి.
– చెన్నమ్మ, ఉపాధి కూలీ, కోవెలకుంట్ల

పనుల వద్ద వసతులు కల్పించాలి



వేసవికాలం కావడంతో పనుల వద్ద ఎలాంటి వసతులు లేవు. నాలుగు వారాల నుంచి ఉపాధి పనులకు వెళుతున్నాను. నీడ వసతి లేకపోవడంతో మండుటెండల్లోనే పనులు చేస్తున్నాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు ఇప్పటి వరకు సరఫరా చేయలేదు. కూలీలు అనారోగ్యం బారిన పడకుండా పనుల వద్ద వసతులు కల్పించాలి.
– రాములమ్మ, ఉపాధి పథక మేటీ, కోవెలకుంట్ల

చలో విజయవాడకు తరలిరండి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీలపట్ల నిర్లక్ష్యం చేస్తున్నాయి. రెండు నెలలుగా కూలీలకు వేతనాలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. పనికి వెళితే కాని పూట గడవటం కష్టం. అలాంటి కుటుంబాలకు నెలలకు తరబడి వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పెండింగ్ వేతనాలు, పనుల వద్ద నీడ, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్‌ప్యాకెట్లు, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ చలో విజయవాడ ఆందోళన కార్యక్రమం చేపట్టాం. ఉపాధి కూలీలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలి.
– సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు, కోవెలకుంట్ల

న్యూస్‌రీల్

వినతుల పరిష్కారంలో చొరవ చూపండి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీల పరిష్కారంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న పీజీఆర్ఎస్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదులన్నింటినీ డాక్యుమెంట్లతో సహా పీజీఆర్ఎస్ పోర్టల్‌కు అప్‌లోడ్ చేయాలన్నారు. సమస్యను సరైన రీతిలో పరిష్కరించకుండా ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లో ముగించరాదన్నారు. క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించిన ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో 220 మంది అర్జీదారులు అర్జీలు సమర్పించారని, వాటిని ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలన్నారు.

ప్రతి భక్తుడితో మర్యాదగా మెలగాలి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల క్షేత్రానికి విచ్చేసే భక్తులందరితో మర్యాదగా మెలగాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. సోమవారం ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఉగాది మహోత్సవాలపై దేవస్థాన వివిధ శాఖాధిపతులు, పర్యవేక్షకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉగాది మహోత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారని, ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలలో ఆయా కైంకర్యాలన్నీ సమయానుకూలంగా, పరిపూర్ణంగా చేపట్టాలన్నారు. నల్లమల అటవీప్రాంతంలో పాదయాత్ర భక్తులకు తాగునీటి సదుపాయం, సేదతీరేందుకు షామియానాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాల్లో 12లక్షల లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. క్షేత్ర పరిధిలో శాశ్వత మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు.

రెండు టీఎంసీలకు ఇండెంట్



కేసీ కాల్వలో తగ్గిన నీటి ప్రవాహం

జూపాడుబంగ్లా: కేసీ నీటి వాటాగా తుంగభద్ర డ్యాం నుంచి రెండు టీఎంసీల నీటి విడుదలకు ఉన్నతాధికారులు ఇండెంట్ పెట్టినట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సుంకేసుల డ్యాంలో 0.5 టీఎంసీల నీటిమట్టం ఉండగా డ్యాం నుంచి కేసీ కాల్వకు వెయ్యి క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మల్యాల నుంచి 338 క్యూసెక్కులు కలిపి కేసీ కాల్వకు 1,338 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 546 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. ఈ నీటిని నేరుగా తూడిచెర్ల సబ్ చానల్ కాల్వకు మళ్లిస్తున్నట్లు ఏఈ తెలిపారు.

మోహినీ అలంకారంలో అహోబిలేశుడు

అమృతం అసురుపాలు కాకుండా లోక సంరక్షణ కోసం మహా విష్ణువు దాల్చిన జగన్మోహిని అలంకరణలో ప్రహ్లాదవరుడు భక్తులకు దర్శనమిచ్చారు. అహోబిలేశుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా దిగువ అహోబిలంలో సోమవారం ప్రహ్లాదవరుడు జగన్మోహిని అలంకారంలో కనువిందు చేశారు. పట్టు వస్త్రాలు, మిరుమిట్లు గొలిపే ఆభరణాలు ధరించి పల్లకీలో మాడ వీధుల్లో విహరించారు. ఎగువ అహోబిలంలో వెలసిన జ్వాలా నరసింహస్వామి పొన్నచెట్టు వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.
– ఆళ్లగడ్డ



మోహినీ అలంకరణలో ప్రహ్లాదవరదస్వామి

కూటమి సర్కారు యువతను నట్టేట ముంచింది

బొమ్మలసత్రం: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను కూటమి సర్కారు నట్టేట ముంచిందని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా విమర్శించారు. ఈనెల 12వ తేదీన నిర్వహించే యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి నివాసంలో ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం కోసం సూపర్‌సిక్స్ పథకాల పేరుతో జనాలను నమ్మించి వంచించాడన్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలు సాధ్యం కాదని బాబు ఒప్పుకున్నారన్నారు. విద్యార్థులకు అందించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను జాప్యం చేయటం సరికాదన్నారు. పేద విద్యార్థుల కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన అమ్మఒడి, విద్యా, వసతి దీవెన పథకాలను కూటమి ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పేద విద్యార్థుల మెడికల్ విద్యా కల సాకారానికి తెచ్చిన 17 మెడికల్ కాలేజీలను నిర్వీర్యం చేసే ప్రయత్నం మానుకోవాలన్నారు. ఈనెల 12న నిర్వహించే యువత పోరు కార్యక్రమానికి భారీ సంఖ్యలో యువత, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దాల్మిల్ అమీర్, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు డాక్టర్ శశికళా రెడ్డి, సీనియర్ నేత సుధాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, కార్యదర్శులు బాషా, హరిప్రసాద్, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు టీవై శివయ్య, మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ తిరుపతి, కౌన్సిలర్ ప్రెసిడెంట్ రమణ, కౌన్సిలర్లు ఆరిఫ్ నాయక్, మేసా చంద్రశేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, బాషిద్, నాయకులు సలాముల్లా, రహంతుల్లా, గన్నీ కరీమ్, సాయిరామ్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, కాల్వ నాగరాజు పాల్గొన్నారు.



యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, పార్టీ నేతలు

కమీషన్ ఇవ్వనిదే సర్పంచ్‌ల బిల్లులు పెట్టడం లేదు

- సర్పంచ్‌ల హక్కులను కాపాడండి
- కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

నంద్యాల: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పరిస్థితులు రోజురోజుకు అధ్వానంగా మారువుతున్నాయని, టీడీపీ నేతలు చిల్లర డబ్బుల కోసం గ్రామాల అభివృద్ధినే అడ్డుకుంటున్నారని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథరెడ్డి విమర్శించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఆయన రుద్రవరం మండలంలోని సర్పంచ్‌లతో కలిసి వచ్చి సర్పంచ్‌ల హక్కులు కాపాడాలని జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్‌లకు పెద్ద పీట వేస్తున్నామని కూటమి పాలకులు అసెంబ్లీలో ప్రగల్భాలు పలుకుతున్నారని, వారు గ్రామాలకు వచ్చి చూస్తే వాస్తవం అర్థమవుతుందన్నారు. సర్పంచ్‌లు చేసిన పనులకు కమీషన్ ఇవ్వనిదే రుద్రవరం మండల ఈఓఆర్‌డీ బిల్లులు పెట్టడం లేదన్నారు. జెడ్పీటీసీలకు సంబంధించిన నిధులు మంజూరైనా వర్క్ ఆర్డర్లు ఇవ్వడం లేదన్నారు. జెడ్పీటీసీలు చెప్పిన వారికి కాకుండా ఎంపీడీఓలు కూటమి నాయకుల పేర్ల మీద వర్క్ ఆర్డర్లు తయారు చేసి తీర్మానాలు చేయాలని గ్రామాల సర్పంచ్‌లకు పంపుతున్నారన్నారు. గ్రామ సర్పంచ్‌లు వీటిని తిరస్కరించడంతో పనులన్నీ ఆగిపోతున్నాయన్నారు. కమీషన్ ఇవ్వనిదే అధికారులు బిల్లులు పెట్టడం లేదని, ఈ కమీషన్ ఎవరికి పోతుందో అందరికీ తెలుసునన్నారు. సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీపీల హక్కులు కాపాడేందుకు తాను ఎంత వరకైనా పోరాటం చేస్తానన్నారు. రుద్రవరం మండల పరిధిలోని కోటకొండ చెరువులో కూటమి నాయకులు యథేచ్ఛగా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ అక్రమ మైనింగ్ వల్ల రైతుల పొలాల్లోకి దుమ్ము, మట్టి చేరి పంటలు దెబ్బతింటున్నాయన్నారు. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లామని, ఇరిగేషన్ అధికారులను పిలిపించి విచారించగా కోటకొండ చెరువులో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని చెప్పారన్నారు. ఆయన వెంట ఆళ్లగడ్డ మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పీపీ మధుసూదన్ రెడ్డి, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.



సర్పంచ్‌ల సమస్యలపై కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథరెడ్డి

రాజకీయ కక్షతో వేధిస్తే ప్రజలే తిరగబడతారు

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

కర్నూలు: రాజకీయ కక్షతో ప్రతిపక్ష పార్టీ నాయకులను వేధిస్తే ప్రజలే తిరగబడతారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి హెచ్చరించారు. కర్నూలు శివారులోని జిల్లా కారాగారంలో ఉన్న ప్రముఖ సినీ నటుడు పోసాని మురళీ కృష్ణతో కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోమవారం ములాఖత్ అయి పరామర్శించారు. అనంతరం కారాగారం గేటు బయట కాటసాని మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకుల మీద కక్ష సాధింపులు కొనసాగుతున్నాయని, అధికారం ఉంది కదా అని రాజకీయ కక్షతో ఒకే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో కేసులు పెట్టి వేధించడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం పోలీసు వ్యవస్థను భ్రష్టుపట్టిస్తోందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఏది మాట్లాడినా అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని, అదే టీడీపీ నాయకులు మాట్లాడితే మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. చట్టం అనేది ఒకరి సొత్తు కాదని, అందరికీ సమానంగా ఉండాలన్నారు. ఎళ్లకాలం ఒకేలా ఉండదని, కూటమి నాయకులు గుర్తుపెట్టుకుని నడుచుకోవాలన్నారు.

తమ్ముళ్ల మద్యం వివాదం

- కోట్ల, ధర్మవరం వర్గీయుల మధ్య బెడిసి కొట్టిన సిండికేట్
- రచ్చకెక్కిన మద్యం దుకాణాల ఏర్పాటు పంచాయితీ
- అధికారుల అండతో ధర్మవరం వర్గీయుడికి కోట్ల వర్గీయుల చెక్

డోన్: మద్యం దుకాణదారుల మధ్య సిండికేట్ ఒప్పందం బెడిసి కొట్టడంతో డోన్‌లో తెలుగు తమ్ముళ్ల మధ్య వివాదం రచ్చకెక్కింది. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి వర్గీయుల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. అధికారులు ఎమ్మెల్యే వర్గీయులకు కొమ్ము కాస్తున్నారని సుబ్బారెడ్డి వర్గీ వర్గం ఏకంగా పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసింది. ఇటీవల గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలను కేటాయించింది. ఈ క్రమంలో కోట్ల, ధర్మవరం వర్గీయులకు చెరొకటి దక్కింది. అయితే రూరల్ కేటగిరిలో కోట్ల వర్గీయుడు రంగన్నకు వచ్చిన దుకాణాన్ని కోట్లవారి పల్లెలో గతంలో ఉన్న ధర్మవరం వర్గీయుడి దుకాణం ఎదురుగా ఏర్పాటు చేశారు. దీంతో ఆగ్రహించిన వారు పట్టణంలో తమకు కేటాయించిన మరో దుకాణాన్ని తారక రామనగర్‌లోని కోట్ల వర్గీయుల మద్యం దుకాణం సమీపంలో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మద్యం దుకాణాల ఏర్పాటు వివాదం తారా స్థాయికి చేరుకుంది. అయితే కోట్ల వర్గీయులు అధికారుల అండతో సుబ్బారెడ్డి వర్గానికి చెక్ పెట్టారు. గీత కార్మికుల కింద దుకాణం పొందిన ఆర్‌ఈ రాఘవేంద్ర అనే వ్యక్తి తారకరామనగర్‌లో ఏర్పాటు చేసి దుకాణాన్ని ఖాళీ చేయించాలని ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదేశించారు. అయితే కోట్ల వారిపల్లెలో తమకు పోటీగా పెట్టిన కోట్ల వర్గం మద్యం దుకాణాన్ని కూడా ఎత్తివేయాలని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మితో వాదనకు దిగారు. ఆ మేరకు సోమవారం వినతిపత్రం ఇవ్వకపోగా ఆమె తీసుకునేందుకు నిరాకరించడంతో సుబ్బారెడ్డి వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీలో సభ్యత్వం కూడా లేని వ్యక్తులకు ఎమ్మెల్యే పరోక్షంగా సహాయపడి తమ వర్గం ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని సుబ్బారెడ్డి వర్గీయులు నారా లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్, సివిల్ పోలీసు అధికారులు ఒక వర్గానికే కొమ్ముకాసి బెల్టుషాపుల ఏర్పాటును ప్రోత్సహించడమే కాక తమ వర్గాన్ని ఆర్థికంగా దెబ్బతీస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ వరలక్ష్మిని వివరణ కోరగా తారకరామనగర్‌లోని మద్యం దుకాణం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే దుకాణాన్ని ఖాళీ చేసి మరో చోట ఏర్పాటు చేసుకోవాలని సూచించామన్నారు.



ఆర్‌ఈ రాఘవేంద్ర ఇస్తున్న అర్జీని తీసుకునేందుకు నిరాకరిస్తున్న ఎక్సైజ్ సీఐ

తొమ్మిదేళ్లుగా లేని అభ్యంతరం ఇప్పుడెందుకు..

గత టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కూడా తారకరామనగర్‌లో మద్యం దుకాణం ఉంది. ఇదే దుకాణంలోనే ఇప్పుడు కూడా ఏర్పాటు చేశాం. అయితే ఇన్నాళ్లు లేని అభ్యంతరం ఇప్పుడే ఎందుకు వచ్చిందో అధికారులు సమాధానం చెప్పాలి. కేవలం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అధికారుల అండతో మా వ్యాపారాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు.
– ఆర్‌ఈ రాఘవేంద్ర, మద్యం దుకాణ లైసెన్స్‌దారుడు



తారకరామనగర్‌లో ధర్మవరం సుబ్బారెడ్డి వర్గీయుడికి చెందిన మద్యం దుకాణం

సిండికేట్ ఎత్తేశారు..

డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్ల మండలానికి 7, డోన్ మండలానికి 8, ప్యాపిలి మండలానికి 3 మద్యం దుకాణాలు లాటరీలో మంజూరయ్యాయి. మొదట్లో సిండికేట్ ఏర్పాటు చేసి సీసాపై రూ. 10 అధిక ధర అమ్మేలా నిర్ణయించుకున్నారు. అలాగే ఊరూరా బెల్ట్ దుకాణాలు నిర్వహించేలా సిండికేట్ ముందుకొచ్చింది. అయితే సిండికేట్ బెడిసికొట్టడంతో ఈనెల 1వ తేదీ నుంచి ఎవరి వ్యాపారం వారిది అన్నట్లుగా సాగుతోంది. అంతకు ముందు కోట్ల వర్గీయులు ఇద్దరు మరో రెండు మద్యం దుకాణ యజమానులతో కలిసి సిండికేట్‌గా ఏర్పడ్డారు. వీరిమధ్య ఆర్థిక లావాదేవీల్లో వివాదం చిలికి చిలికి గాలివానై సిండికేట్ వ్యవహారం మూడు నెలలకే బెడిసి కొట్టింది. దీనికి ధర్మవరం సుబ్బారెడ్డే కారణమని ఎమ్మెల్యే కోట్ల వర్గీయులు అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు. అయితే బెల్ట్ దుకాణాల నిర్వాహకుల పరిస్థితి ఇప్పుడు దారుణంగా మారింది. జగదుర్తి గ్రామం వద్ద బెల్టుషాపు నిర్వహణ కోసం కొండపేటకు చెందిన టీడీపీ నాయకునికి తాను రూ.25 వేలు డిపాజిట్ కింద చెల్లించి మోసపోయానని ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన ఎల్లాగౌడ్ అనే వ్యక్తి వాపోయారు. తనపై పోలీసులు కేసు నమోదు చేయకుండా చూసే బాధ్యత తనదని భరోసా ఇచ్చిన నాయకులు ఇప్పుడు మొహం చాటేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల మాటలు బెల్ట్ షాప్ నడుపుతున్న తనను ఎక్సైజ్ పోలీసులు పట్టుకొచ్చారని మరో వ్యక్తి వాపోతున్నాడు.

క్లుప్తంగా

రాళ్ల ట్రాక్టర్ బోల్తా పడి బాలుడి మృతి


మృతి చెందిన జస్వంత్

పాములపాడు: మండలంలోని చెలిమల గ్రామ సమీపంలో రాళ్ల ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. లింగాల గ్రామానికి చెందిన మోహన్‌రావు కుమారుడు జస్వంత్ (17) 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం పని మీద పాములపాడుకు వచ్చిన జస్వంత్ తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్తున్న రాళ్ల లోడు ట్రాక్టర్ ఎక్కాడు. మార్గమధ్యలో చెలిమిల గ్రామ సమీపంలో ఎద్దుల వంక వాగు వద్ద ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో రాళ్లపై కూర్చున్న బాలుడు జస్వంత్‌పై రాళ్లుపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో బాలుడు సంగీత రాజు క్షేమంగా బయట పడ్డాడు. ప్రస్తుతం డ్రైవర్ స్వాములు పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన గుర్రప్ప

కొలిమిగుండ్ల: నందిపాడుకు చెందిన గుండ్రె గుర్రప్ప(48) అప్పుల బాధతో సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ బాబా ప్రకృద్దీన్ తెలిపారు. గుర్రప్ప నాపరాళ్ల వ్యాపారం చేస్తూ నష్టపోయి ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాడు. కుమారుడు చదువు, కుమార్తె వివాహం కోసం ఫైనాన్స్ సంస్థల వద్ద రూ.9లక్షలు అప్పు చేశాడు. ఇందులో రూ.3 లక్షలు వాయిదాల రూపంలో చెల్లించాడు. మిగిలిన బకాయి చెల్లించే అవకాశం లేక ఆర్థిక సమస్యలతో సతమతమయ్యాడు. దీతో మనస్తాపం చెంది తిమ్మనాయినపేట జంక్షన్ సమీపంలోని పొలంలోకి వెళ్లి శనగ మాత్రలు మింగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు గుర్తించి తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చెట్టుపై నుంచి కింద పడి యువకుడి మృతి


అల్తాఫ్ (ఫైల్)

ఆదోని అర్బన్: పెద్దకడబూరు మండలం నెమలికల్లు గ్రామానికి చెందిన అల్తాఫ్(26) అనే యువకుడు చెట్టుపై నుంచి కిందపడి సోమవారం మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాలు మేరకు .. ఉదయం పొలంలోని టెంకాయ చెట్టు ఎక్కి టెంకాయలను తెంపుతుండగా అకస్మాత్తుగా పై నుంచి కింద పడ్డాడు. కిందకు పడిన యువకుడిని వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే అల్తాఫ్ మృతిచెందాడు. మృతుడికి భార్య సునీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు వలస వెళ్లి ఇటీవలే గ్రామానికి చేరుకున్నాడు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో రోదనలు మిన్నంటాయి.

ఏపీఎస్పీ రెండవ పటాలంలో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- మార్గదర్శకాలతో మెమో జారీ చేసిన కమాండెంట్
- అర్హుల జాబితాను సిద్ధం చేసిన కంపెనీ ఆర్ఐలు

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంలో సిబ్బంది బదిలీలకు రంగం సిద్ధమైంది. నూతన కమాండెంట్ బాధ్యతలు చేపట్టిన దీపిక పాటిల్ ఆదేశాల మేరకు బదిలీల జాబితా సిద్ధమైనట్లు సిబ్బందిలో చర్చ జరుగుతోంది. గత నెల 25న కమాండెంట్ సంబంధిత కంపెనీ ఆర్ఐలకు(ఆఫీసర్ కమాండింగ్) బదిలీలకు సంబంధించిన మెమో (ఉత్తర్వులు) ఇచ్చారు. బెటాలియన్‌లో తొమ్మిది కంపెనీలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఏళ్ల తరబడి బయటి కంపెనీల్లో పనిచేసిన వారిని హెడ్ క్వార్టర్‌కు బదిలీ చేయాల్సి ఉంది. మొత్తం పటాలంలో దాదాపు 1100 మంది సిబ్బంది ఉన్నారు. టర్న్ ప్రకారం ప్రతి ఒక్కరికీ హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహించేలా అవకాశం కల్పించాలి. ఇందుకు అనుగుణంగా కమాండెంట్ చర్యలు చేపట్టడంతో ఫెవికాల్ వీరులు పైరవీలు ముమ్మరం చేసినట్లు చర్చ జరుగుతోంది. ఒకటి రెండు రోజుల్లో బదిలీల జాబితా వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొంతమంది ఆఫీసర్ కమాండెంట్లు చేతివాటం ప్రదర్శించి బదిలీల జాబితా తయారీలో అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని, జాబితాను సమగ్రంగా పరిశీలించి ఏళ్ల తరబడి బయటి కంపెనీలో పనిచేస్తున్న వారికి కమాండెంట్ న్యాయం చేస్తారనే ఆశాభావం సిబ్బందిలో వ్యక్తమవుతోంది.


ఏపీఎస్పీ రెండో పటాలం పరిపాలన విభాగం కార్యాలయం

వీరు ఫెవికాల్ వీరులు

- స్టోర్ ఎన్‌సీఓగా ఎమ్‌టీ గ్రూప్‌లో హెడ్ కానిస్టేబుల్ రంగసామిరెడ్డి 15 ఏళ్లుగా కొనసాగుతున్నారు. దీపిక పాటిల్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత సిబ్బంది సమస్యలపై దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగసామిరెడ్డిపై పలువురు సిబ్బంది ఫిర్యాదు చేశారు. దీంతో అతడి స్థానంలో బాల హుసేన్ (హెచ్‌సీ 817)ను నియమించారు. అవమానంగా భావించిన రంగసామిరెడ్డి ద్వితీయ శ్రేణి అధికారి సహాయంతో సిక్ లీవ్‌లో వెళ్లారు. ఇందుకు ఓ అధికారికి పి-క్యాప్ స్టిక్ కానుకగా బహుకరించినట్లు సిబ్బందిలో చర్చ జరుగుతోంది. ఈయన ఏఎంటీఓ ద్వారా హెడ్ క్వార్టర్‌లోనే కొనసాగేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.
- సమరసింహారెడ్డి (కళ్యాణ మండపం నిర్వహణ) 20 ఏళ్లుగా హెడ్ క్వార్టర్‌లోనే కొనసాగుతున్నారు.
- తిరుమల్‌రెడ్డి 30 ఏళ్లుగా ట్రైనింగ్ గ్రూప్‌లోనూ, బందె నవాజ్ 20 ఏళ్లుగా బెటాలియన్ హాస్పిటల్‌లో, హెడ్ కానిస్టేబుల్ మౌలాలి పదేళ్లుగా హాస్పిటల్ విధులు, టైలరింగ్ గ్రూప్‌లో 15 ఏళ్లుగా జిలానీ బాషాతో పాటు మరో పది మంది దాకా వివిధ గ్రూపుల్లో హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహిస్తుండటం వల్ల బయటి కంపెనీల్లో పనిచేసేవారికి అవకాశం దక్కడం లేదని సిబ్బంది వాపోతున్నారు.
- అసిస్టెంట్ కమాండెంట్ల దగ్గర విధులు నిర్వహించే పీఏలు కూడా ఏళ్ల తరబడి హెడ్ క్వార్టర్‌లోనే కొనసాగుతున్నట్లు సిబ్బందిలో చర్చ జరుగుతోంది.
- కానిస్టేబుల్ కిరణ్ 20 ఏళ్లుగా అసిస్టెంట్ కమాండెంట్ దగ్గర పనిచేస్తున్నారు.
- విశ్వనాథ్ రెడ్డి ట్రెజరీలో ఎనిమిదేళ్లుగా హెడ్ క్వార్టర్‌లోనే ఉంటున్నారు.
- డీఎస్పీలు ఎస్ఎం బాషా దగ్గర హుసేనయ్య, రమణ దగ్గర రియాజ్, రవికిరణ్ దగ్గర రాజు కొన్నేళ్లుగా సీట్లకు అతుక్కుని విధులు నిర్వహిస్తున్నారు.
- హెడ్ కానిస్టేబుల్ విశ్వనాథ్ రెడ్డి కూడా అసిస్టెంట్ కమాండెంట్, గతంలో కమాండెంట్ దగ్గర విధులు నిర్వహిస్తున్నారు. కానిస్టేబుల్‌గా విధుల్లో చేరినప్పటి నుంచి హెడ్ క్వార్టర్‌లోనే కొనసాగుతుండటంతో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

బదిలీలకు రూ.లక్షల్లో వసూలు

నచ్చిన చోటుకు పంపేందుకు, ఉన్న చోటనే కొనసాగించేందుకు ఉద్యోగుల నుంచి గతంలో మామూళ్లు వసూలు చేశారని ఫిర్యాదుల నేపథ్యంలో పదవీ విరమణ పొందిన ఓ ఉన్నతాధికారిపై విచారణ జరిగింది. పదవీ విరమణకు ఒక రోజు ముందు బదిలీల పేరుతో ఇద్దరు అధికారులు చక్రం తిప్పి ముడుపులు వసూలు చేశారు. వివిధ హోదాల్లో ఉన్న వంద మందికి స్థానచలనం కల్పించి గత కమాండెంట్ రూ.లక్షల్లో దండుకున్నారు. ఈ తరహా బదిలీలపై సిబ్బంది నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో డీఐజీ రాజకుమారి ఆదేశాల మేరకు 16వ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్ గతంలో విచారణ జరిపి ఆ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. అయితే చర్య ప్రశ్నార్థకంగా మారినట్లు తెలుస్తోంది.

మేనేజర్, స్టోర్ ఎన్‌సీఓ పోస్టులకు భారీ పోటీ

ప్రతి కంపెనీలో ఒక మేనేజర్, స్టోర్ ఎన్‌సీఓ ఉంటాడు. ఆయా పోస్టులను దక్కించుకునేందుకు సిబ్బంది పోటీ పడుతున్నారు. నిబంధనల ప్రకారం ఆయా పోస్టుల్లో విధులు నిర్వహించాలంటే అందుకు సంబంధించిన శిక్షణ తప్పనిసరి. గతంలో ఇదే విధులు నిర్వహించిన వారికి మళ్లీ నియమించకూడదనే నిబంధన కూడా ఉంది. అయితే కొందరు రెండోసారి కూడా ఆయా పోస్టుల్లో పనిచేశారు.

శాస్త్రీయ పద్ధతులతో పాడిపరిశ్రమ లాభసాటి


మాట్లాడుతున్న ఏడీ డాక్టర్ సుధాకర్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): శాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తే పాడిపరిశ్రమను లాభసాటిగా మార్చుకోవచ్చని ఆర్ఏహెచ్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.సుధాకర్ రెడ్డి తెలిపారు. కర్నూలు కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్ధ పశువైద్యశాల ప్రాంగణంలోని ట్రైనింగ్ సెంటర్‌లో పాడిరైతులకు 3 రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా వాణిజ్య సరళిలో పాడిపశువుల పెంపకం అనే అంశంపై సోమవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాడి రైతులనుద్దేశించి ఏడీ డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా పాడిపశువుల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏడాది పొడవునా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ అరుణశ్రీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల ధరలు అంతంత మాత్రమే

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వాము ధర ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ రైతులకు అంతంతమాత్రం ధర లభిస్తోంది. సోమవారం మార్కెట్‌కు 254 మంది రైతులు 802 క్వింటాళ్ల వాము తెచ్చారు. గరిష్ట ధర రూ.28,888 ఉన్నట్లు ప్రకటించినప్పటికి.. దాదాపు 240 మంది రైతులకు అంతంతమాత్రం ధరే లభించింది. సగటు ధర రూ.12,399 పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా తెలుస్తోంది.

- ఉల్లి ధరలు పడిపోయాయి. మార్కెట్‌కు ఉల్లి 2,873 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ట ధర రూ.517, గరిష్ట ధర రూ.1537 లభించగా... సగటు ధర రూ.1,187 నమోదైంది. మిర్చికి గరిష్టంగా రూ.12769 లభించింది. సగటు ధర కేవలం రూ.8,720 మాత్రమే నమోదైంది. మార్కెట్‌కు 1,768 క్వింటాళ్ల కందులు వచ్చాయి. కనిష్ట ధర రూ.3,100, గరిష్ట ధర రూ.7,158 లభించగా.. సగటు ధర రూ.6,909 మాత్రమే పలికింది.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


పందుల బాలరాజు (ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, నాయకులు

పత్తికొండ రూరల్/ఆస్పరి: రోడ్డు ప్రమాదంలో పందికోన గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పందుల బాలరాజు (34) మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో బాలరాజు చురుగ్గా పాల్గొనేవాడు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో ముగ్గురు సంతానంలో పెద్దకుమార్తె పేరు షర్మిల, చిన్నకుమారుడి పేరు జగన్ అని పెట్టుకున్నారు. ఆస్పరి మండలం కైరుప్పల సమీపంలో ఆదివారం దేవరకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆటోలో వస్తూ అదుపుతప్పి ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. బాలరాజు మృతితో భార్య సరోజ, బంధువులు బోరున విలపించారు. మృతి వార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సోమవారం ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

టీడీపీ డీలరా.. మజాకా..!

- వినియోగదారుల థంబ్ తీసుకుని రేషన్ ఇవ్వని వైనం
- ఫిబ్రవరి నెలలో దాదాపు 80 బస్తాల బియ్యం మాయం
- లబోదిబోమంటున్న కార్డుదారులు


బియ్యం వేయలేదని వాపోతున్న కార్డుదారులు

పగిడ్యాల: పేద ప్రజలకు చౌకదుకాణాల ద్వారా ఉచితంగా సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కార్డుదారుల వేలిముద్రలను తీసుకుని బియ్యం వేయకుండా మోసం చేసిన వైనం పడమర ప్రాతకోట గ్రామం 21వ షాపు పరిధిలో వెలుగు చూసింది. గత జగనన్న ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ ఇంటింటికి పంపిణీ చేయగా.. కూటమి ప్రభుత్వం అధికార పార్టీ నేతలను డీలర్లు మార్చి పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తోంది. ఇందుకు పడమర ప్రాతకోట 21వ షాపు నిర్వాకుడే నిదర్శనం. ఈ షాపు పరిధిలో 709 కార్డులు ఉన్నాయి. ప్రతి నెల ఏఏవై కార్డ్సకు 13.30 క్వింటాళ్లు, తెల్లరేషన్‌కార్డులకు 90.50 క్వింటాళ్లు కాగా క్లోజింగ్ బ్యాలెన్స్ (సీబీ) పోగా ఓపెనింగ్ బ్యాలెన్స్ 55.84 క్వింటాళ్లు సరఫరా చేస్తున్నామని సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ నివేదిక అందజేశారు. కార్డుదారులకు టోకరా కొట్టేందుకే ఎండీయూ వాహన డ్రైవర్‌తో బయోమెట్రిక్ మిషన్ ఆన్ చేయించుకుని డీలర్లే స్వయంగా కార్డుదారుల థంబ్ తీసుకుని బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'ప్రభుత్వం మాది మేము బియ్యం పంచుకుంటాం.. కేవలం థంబ్ వేయించి పోండి' అంటూ ఎండీయూ డ్రైవర్‌లపై డీలర్లు పెత్తనం చెలాయిస్తున్నట్లు సమాచారం. అందుకే ఫిబ్రవరి నెలకు సంబంధించి బియ్యం కోటా తక్కువ వచ్చిందని మార్చి నెలలో రెండు నెలల బియ్యం ఒకేసారి వేస్తానని కార్డుదారుల వేలిముద్రలు తీసుకుని దాదాపు 80 ప్యాకెట్ల బియ్యాన్ని డీలర్ మాయం చేసినట్లు సమాచారం. ఎక్కువగా 20 కేజీలు, 25 కేజీలు, 35 కేజీలు కలిగిన కార్డుదారుల వ్రేలిముద్రలను తీసుకుని బియ్యం వేయనట్లు తెలుస్తోంది. పేదల నోటి కాడి బియ్యాన్ని పక్కదారి పట్టించిన అధికార పార్టీ డీలర్‌పై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.

బియ్యం వేయకుండానే వేలిముద్రలు తీసుకున్నాడు

పోయిన నెలలో నా కార్డుకు బియ్యం వేసి మా కొడుకుల కార్డులకు బియ్యం వేయలేదు. వేలిముద్రలు తీసుకున్నావ్ కదా అని అడిగితే వచ్చే నెలలో వేస్తానని చెప్పినాడు. ఈనెల బండి ఇంకా రాలేదు.
– హజరాంబీ, పడమర ప్రాతకోట

5 కేజీలు, 10 కేజీల కార్డులకు మాత్రమే వేశారు

కార్డులో ఒకరు, ఇద్దరు, ముగ్గురు ఉన్న వాళ్లకు మాత్రమే 5 కేజీలు, 10, 15 కేజీల బియ్యం వేశారు. 20, 25, 30 కేజీల ఉన్న వారికి ఇవ్వలేదు. నా కొడుకు తలారి అయినా బియ్యం వేయలేదు. ముస్లిం కాలనీలో చాలా మందికి వేయలేదు. రెండు నెలల బియ్యం వేస్తానని వ్రేలిముద్రలు వేయించుకున్నాడు.
– మొల్ల జైబున్‌బీ,పడమర ప్రాతకోట

నా దృష్టికి రాలేదు

పడమర ప్రాతకోటలోని 21వ షాపు డీలర్ బియ్యం సరిగా పంపిణీ చేయని విషయం నా దృష్టికి రాలేదు. మార్చి నెల కోటా బియ్యం పంపిణీ జరుగుతోంది. ఆర్ఐతో విచారణ చేయించి రెండు నెలల బియ్యం వేసేలా చర్యలు తీసుకుంటాం.
– శివరాముడు, తహసీల్దార్, పగిడ్యాల

ఊపందుకున్న రైతుల రిజిస్ట్రేషన్

- కర్నూలు జిల్లాలో 70 శాతం, నంద్యాల జిల్లాలో 63 శాతం నమోదు

కర్నూలు(అగ్రికల్చర్): కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రైతులకు ఆధార్ తరహాలో 11 అంకెలతో కూడిన ప్రత్యేక నెంబర్‌ను కేటాయించే ప్రక్రియ చేపట్టింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్(ఏపీఎఫ్ఆర్)లో రైతులను రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమాన్ని వ్యవసాయ యంత్రాంగం వేగవంతం చేసింది. ఈ నెల 25లోపు ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.

- కర్నూలు జిల్లాలో 2,37,465 మంది రైతులను ఏపీఎఫ్ఆర్ పోర్టల్ రిజిస్ట్రేషన్ చేయాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు 2,28,859 మంది రైతులను రిజిస్ట్రేషన్ చేశారు. 70.4 శాతం పురోగతి ఉంది.
- నంద్యాల జిల్లాలో 2,51,457 మంది రైతులను రిజిస్ట్రేషన్ చేయాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు 1,59371 మంది రైతులను ఎన్‌రోల్ చేశారు. ఇక్కడ 63 శాతం ప్రగతి ఉండటం గమనార్హం.
- అయితే ఇప్పటి వరకు రైతులెవ్వరికీ 11 అంకెల యూనిక్ ఐడీ నెంబరు జనరేట్ అయిన దాఖలాలు లేవు.
- ఆధార్‌లో పేర్ల వివరాలు, ఆర్ఓఆర్‌లోని వివరాలు 80 శాతం వరకు సరిపోతే రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి పరిధిలోనే 11 అంకెల యూనిక్ ఐడీ నెంబర్ వస్తుంది.
- వివరాలు సరిపోలని పక్షంలో అలాంటి వాటిని వీఆర్ఓ లాగిన్‌కు అప్‌లోడ్ చేస్తారు.
- వీఆర్‌వోలు రెవెన్యూ రికార్డులు, ఆర్ఓఆర్‌లను పరిశీలించి తేడాలు ఉంటే వెబ్‌ల్యాండ్‌లో సరిచేస్తారు. ఆ తర్వాతనే యూనిక్ ఐడీ వస్తుంది.

ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం

- బస్సును ఢీకొన్న ట్రాక్టర్


బోల్తా పడిన ట్రాక్టరు(ఇన్‌సెట్లో) మృతుడు యశ్వంత్

వెల్దుర్తి: ఆర్టీసీ బస్సును ట్రాక్టర్ ఢీకొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్ యశ్వంత్ (23) మృతిచెందారు. ఈ దుర్ఘటన వెల్దుర్తి సమీపంలోని హైవే 44పై సోమవారం చోటుచేసుకుంది. ఉదయం 6గంటల సమయంలో కర్నూలు నుంచి అనంతపురం వైపు ఏపీఎస్ ఆర్టీసీ కర్నూలు డిపో అల్ట్రా డీలక్స్ బస్సు వెళ్తోంది. అదే సమయంలో పసుపుల నుంచి వెల్దుర్తికి సొప్పలోడు కోసమని ట్రాక్టరు వస్తోంది. బస్సును పక్కనుంచి ఢీకొనడంతో ట్రాక్టరు ట్రాలీతో విడిపోయి రహదారిపై బోల్తాపడింది. బస్సు డివైడర్ పైకెక్కి, ముందు టైర్లు పగిలిపోయి ఆగిపోయింది. బస్సు పాక్షికంగా ధ్వంసమైంది. ఈ ఘటనలో పసుపులకు చెందిన ట్రాక్టరు డ్రైవర్ యశ్వంత్ మృతిచెందారు. ట్రాక్టర్ క్లీనర్ అదే గ్రామానికి చెందిన సంజీవ్ గాయపడ్డాడు. బస్సు డ్రైవర్, 39 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. ట్రాక్టర్ డ్రైవర్ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం వెల్దుర్తి ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

చాగలమర్రిలో దంపతులపై దాడి

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని మంగలి వీధిలో షేక్ బీబీ, మహబూబ్‌బాషా దంపతులపై అదే కాలనీకి చెందిన వారు దాడి చేశారు. సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే..మహబూబ్‌బాషా ఇంటి ఎదురుగా తాజు, తాహెర్ అనే వ్యక్తులు నివసిస్తారు. ఇళ్ల ముందు వాహనాలు నిలిపే విషయంలో ఇరుకుటుంబాల మధ్య గొడవ ఉంది. ఈ క్రమంలో సోమవారం తాజు, తాహెర్ మరికొంత మంది మహబూబ్‌బాషా దంపతుల ఇంటిపైకి వెళ్లి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బీబీతో పాటు భర్తను స్థానిక ఓ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రులపై దాడి విషయం తెలుసుకున్న కుమార్తె అబీదా, బంధువు ఇనాయతుల్లా పరామర్శించేందుకు ప్రొద్దుటూరు నుంచి ఆసుపత్రికి వచ్చారు. నిందితులు మరో పదిమందితో కలిసి అక్కడికి చేరుకొని వారిపై కూడా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉంటే తీవ్రంగా గాయపడిన షేక్ బీబీని వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.


మహబూబ్‌బాషాను విచారణ చేస్తున్న ఏఎస్ఐ

వామ్మో ఎలుగుబంటి

శ్రీశైలం: శ్రీశైలం ముఖద్వారం వద్ద సోమవారం వేకువజామున ఎలుగుబంటి కనిపించింది. అటుగా బైక్‌పై వస్తున్న వారు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. కొన్ని నెలలుగా చిరుతలు, ఎలుగుబంట్లు క్షేత్ర పరిధిలో తిరుగుతున్నాయి. రింగ్ రోడ్డు, రుద్ర పార్క్, సాక్షి గణపతి, పాతాళగంగ రోడ్‌లో సంచరిస్తున్నాయి. అటవీ శాఖ అధికారులు భక్తులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరిట మోసం


- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

కర్నూలు: హైదరాబాద్‌లో బిందు కన్సల్టెన్సీ పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి అశ్విని, సాయికృష్ణ, హిమబిందు కలసి రూ.60 వేలు తీసుకుని మోసం చేశారని కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన రమేష్‌కుమార్ రెడ్డి ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. కర్నూలు టూటౌన్ పక్కనున్న క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 122 ఫిర్యాదులు రాగా.. వీటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన పరిష్కారం చూపుతామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా కూడా పాల్గొని వినతులను స్వీకరించారు.


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని 53 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వృత్తి విద్యాధికారి సునీత తెలిపారు. సోమవారం జరిగిన రెండవ సంవత్సరం మ్యాథ్స్, జువాలజీ, హిస్టరీ పరీక్షకు 9,282 మందికి గాను 9,085 మంది విద్యార్థులు హాజరు కాగా 197 మంది గైర్హాజరయ్యారన్నారు. అలాగే ఒకేషనల్ పరీక్షకు 1,038 మందికి గాను 988 మంది హాజరు కాగా 50 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించామన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్తగా అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.


మాకెవరు సాటిలేరు.. వంతెనపై జీవాలు


భయమెందుకు పదండి.. మందలో కొమ్ములు తిరిగిన పొట్టేలు



ఈత కొట్టి.. ఒడ్డుకు చేరి!

భానుడు ఉగ్ర రూపం దాల్చుతున్నాడు. రోజు రోజుకు ఎండలు మండుతున్నాయి. ప్రజలతో పాటు మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. వైఎస్సార్ జిల్లా పొన్నంపల్లె, అవుకు మండలం కొండమనాయుని పల్లె నుంచి జీవాల మందను కాపరులు మేత కోసం దొర్నిపాడు పొలాల వైపు తీసుకొచ్చారు. ఎండలు అధికంగా ఉండటంతో క్రిష్టిపాడు గ్రామ సమీపంలో ఉన్న కుందూ నదిలో జీవాలకు దించేందుకు తెచ్చారు. మందంతా ఒకేసారి బ్రిడ్జిపైకి వచ్చిన తర్వాత జీవాలను నదిలోకి తోసేశారు. అవి ఈదుతూ ఒడ్డుకు చేరుకుని వేసవి తాపాన్ని తీర్చుకున్నాయి. – దొర్నిపాడు